# రిటైల్ రంగంలో విదేశీ పెట్టుబడులు..

**గత కొన్ని రోజులుగా దేశవ్యాప్తంగా చర్చల్లో నలుగుతున్న అంశం రిటైల్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్- ఎఫ్‌డీఐ). కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా శరవేగంగా ముందుకు కదలడం.. అంతేస్థాయిలో దేశంలోని పలు వర్గాల నుంచి ఆందోళనలు వెల్లువెత్తడం తెలిసిందే. ఇది సంప్రదాయ చిల్లర వర్తకులపై ప్రతికూల ప్రభావం చూపుతుందనే విమర్శలు సర్వత్రా వినిపించాయి. చివరకు యూపీఏ మిత్ర పక్షాలు సైతం దీన్ని వ్యతిరేకించాయి. దీంతో యూపీఏ ప్రభుత్వం ఈ విషయంలో వెనక్కు తగ్గింది. ప్రస్తుతానికి ఆ ఆలోచనను విరమించుకుంది. ఈ నేపథ్యంలో రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐల వల్ల కలిగే పరిణామాలపై విశ్లేషణ..**

**దే**శంలో టెలి కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతించాక ఆ రంగాల్లో చోటు చేసుకున్న అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని.. రిటైల్ రంగంలోనూ ఎఫ్‌డీఐలకు అనుమతిస్తే అది దేశ ఆర్థికవృద్ధికి దోహదపడుతుందనేది అనుకూలవాదుల అభిప్రాయం. కాగా ఈ చర్య దేశంలోని నిరుద్యోగ సమస్యను పెంచి, ప్రజల జీవన ప్రమాణాన్ని కుంటుపరుస్తుందని వ్యతిరేకవాదుల అభిప్రాయం.

భారత ఆర్థిక వ్యవస్థలో రిటైల్ రంగాన్ని ఓ ప్రముఖ రంగంగా పేర్కొనొచ్చు. ప్రపంచంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న మొత్తం 30 మార్కెట్‌లలో భారత్‌ను రెండో అతి పెద్ద మార్కెట్‌గా అంతర్జాతీయ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ఎ.టి. కెర్నీ అభివర్ణించింది. భారత స్థూల దేశీయోత్పత్తిలో 22 శాతం వాటా, శ్రామిక శక్తిలో ఏడు శాతం వాటా రిటైల్ రంగానిదే. దేశంలో ఈ రంగాన్ని సంఘటిత, అసంఘటిత వర్గాలుగా విభజించవచ్చు. సంఘటిత రంగంలో లైసెన్స్‌డ్ రిటైలర్లు వాణిజ్య కార్యకలాపాలు నిర్వహిస్తారు. ఆదాయ, అమ్మకం పన్నుల రిజిస్ట్రేషన్ కలిగుంటారు. కార్పొరేట్ రంగం నిర్వహించే హైపర్ మార్కెట్లు, రిటైల్ చైన్లు, ప్రైవేట్ రంగంలో అతిపెద్ద రిటైల్ వ్యాపారాలు సంఘటిత రంగంలో భాగస్వామ్యంగా ఉంటాయి. అసంఘటిత రంగంలో సంప్రదాయమైన, తక్కువ ధరలతో కూడిన వాణిజ్య కార్యకలాపాలు(కిరాణా దుకాణాలు, జ నరల్ స్టోర్స్, పాన్‌షాప్‌లు, ఫుట్‌పాత్ వ్యాపారాలు వంటి కార్యకలాపాలు) సాగుతాయి. అభివృద్ధి చెందిన దేశాల్లో మొత్తం రిటైల్ వాణిజ్యంలో సంఘటిత రంగం వాటా 80 శాతంపైగా ఉంది. భారత్‌లో ఈ రంగం వాటా కేవలం ఆరు శాతం మాత్రమేనని క్రిసిల్ నివేదిక పేర్కొంది.

ఆసియాలో అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలైన చైనా, థాయ్‌లాండ్, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్‌లతో పోల్చితే భారత్‌లోనే సంఘటిత రంగం వాటా తక్కువ. దీన్నిబట్టి ఈ రంగంలో భారత సాపేక్ష వెనుకబాటుతనం స్పష్టమవుతోంది. దేశ వ్యవసాయ రంగంలో ప్రచ్ఛన్న నిరుద్యోగిత, అల్ప ఉద్యోగిత వల్ల రిటైల్ రంగంలో అసంఘటిత కార్యకలాపాలు పెరిగాయి. బ్రెజిల్, అమెరికా, పోలెండ్‌లతో పోల్చితే భార

త్‌లో ఈ రంగంలో ఉపాధి అవకాశాలు తక్కువే. ప్రస్తుతం మన దేశంలో రిటైల్ వాణిజ్యంలో పరిమిత స్వామ్య మార్కెట్ ధోరణి కనిపిస్తోంది. దీనివల్ల ఉత్పత్తి వైపు నుంచి పరిశీలించినపుడు పరిమిత సంఖ్యలో ఉన్న సప్లయ్‌దారులకు లభించే ధర లేదా ప్రతిఫలం ఎక్కువగా వ్యవసాయరంగంలో కనిపిస్తుంది. మరో వైపు రిటైల్ వాణిజ్యం మొత్తం కొన్ని సంస్థల వద్దే కేంద్రీకృతమైతే, స్వదేశీ సప్లయ్‌లో కొరత ఏర్పడినప్పుడు వినియోగదారుడు చెల్లించే ధర పెరిగి సంస్థల లాభదాయకత పెరుగుతుంది.

మల్టీబ్రాండ్ రంగంలో 51 శాతం, సింగిల్ బ్రాండ్, రిటైల్ రంగంలో వంద శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను అనుమతిస్తూ కేంద్ర కేబినెట్ ఇటీవల తీర్మానం చేసింది. ఈ నేపథ్యంలో సింగిల్ బ్రాండ్ రిటైలర్స్ అయిన IKEA భారత్‌లో కార్యకలాపాలు కొనసాగించే అవకాశం ఉంది. స్థూల దేశీయోత్పత్తిలో 22 శాతం ఉన్న రిటైల్ రంగం వాటా 2015 నాటికి రెట్టింపు కాగలదని అంచనా. కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి ఆనంద్ శర్మ అభిప్రాయంలో రాబోయే మూడు సంవత్సరాల్లో ఈ రంగంలో పది మిలియన్ల ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. మరోవైపు పెద్ద అంతర్జాతీయ రిటైలర్లు భారత్ మార్కెట్‌లో కొంత వాటా చేజిక్కించుకుంటాయి. భారత్‌లో రిటైల్ రంగం ఎక్కువగా ముక్కలుగా ఉండటాన్ని గమనించొచ్చు. దుకాణాల సాంద్రత పరంగా ప్రపంచంలోనే భారత్ మొదటి స్థానాన్ని ఆక్రమించిందని ఏసీ నీల్సన్ అండ్ కేపీఎంజీ టెక్నోప్యాక్ వంటి అంతర్జాతీయ కన్సల్టెన్సీలు అభిప్రాయపడ్డాయి. టెస్కో, కింగ్ ఫిషర్, కారెఫోర్, అనాల్డ్ వంటి ప్రసిద్ధ రిటైల్ సంస్థలు భారత్‌లో రిటైల్ వాణిజ్యంపై అమితాసక్తి చూపుతున్నాయని మెకిన్సే అండ్ కో, సీఐఐ సంయుక్త నివేదిక తెలిపింది.

## భిన్నాభిప్రాయాలు:

రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐల అనుమతుల విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. రిటైల్ రంగం సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం ఉత్పత్తిదారులు, వినియోగదారులకు లాభదాయకమని కొందరి వాదన. కానీ ప్రతిపక్ష పార్టీలు దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పటికే దేశంలో అవినీతి, నల్లధనం, పెరుగుతున్న ధరలు వంటి అంశాలపై ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తున్న తరుణంలో ప్రజల దృష్టిని మళ్లించడానికే ఎఫ్‌డీఐల అంశాన్ని తెరమీదికి తెచ్చారని ప్రతిపక్షాలు అంటున్నాయి. అమెరికాతో అణు ఒప్పందం తర్వాత భారత ప్రభుత్వం తీసుకున్న అతిపెద్ద సాహసోపేత నిర్ణయం ఇదేనని మరికొంత మంది అంటున్నారు.

## దేశంలో రిటైల్ రంగ అభివృద్ధికి చర్యలు:

- భారత్‌లో రిటైల్ రంగానికి బ్యాంకుల పరపతి లభ్యత తక్కువగా ఉంది. సంఘటిత, అసంఘటిత రంగంలోని రిటైలర్లు తమ సామర్థ్యాన్ని మెరుగుపర్చుకునేందుకు అనువుగా ప్రభుత్వం, కేంద్ర బ్యాంకు అభిలషణీయమైన రుణ విధానాన్ని రూపొందించుకోవాలి. అసంఘటిత రంగంలోని రిటైలర్లు సంఘటిత రంగంలోకి మళ్లే విధంగా అవసరమైన స్థలం, పరికరాలపై పెట్టుబడులను ప్రోత్స

హించాలి.

- రిటైల్ రంగ సమస్యల అధ్యయనానికి జాతీయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి విధాన నిర్ణయాన్ని ప్రకటించాలి. వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, స్వదేశంలో వస్తు తయారీ, దిగుమతి వస్తువులకు సంబంధించి విదేశీ రిటైలర్లపై కొన్ని నిబంధనలు విధించాలి.
- జాతీయ కమిషన్ రూపొందించే నిబంధనలు స్వదేశీ మార్కెట్‌లో వస్తు కొనుగోలును ప్రోత్సహించేలా నిర్మాణం, నిల్వ, నాణ్యత మెరుగుపర్చే విధంగా ఉండాలి.
- అసంఘటిత రంగంలో రిటైలర్లు ఉపాధిని కోల్పోతే వారికి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడానికి వీలుగా దేశంలో తయారీ రంగాన్ని వృద్ధి చేయాలి. సంస్కరణల యుగంలో తయారీ రంగంలో ఉపాధి అవకాశాలు తగ్గాయి. స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటా ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని ఆ రంగ అభివృద్ధికి చర్యలు చేపడితే ఉపాధి అవకాశాలు ఎక్కువగా పెరుగుతాయి.
- చిన్న ఉత్పత్తిదారుల నుంచి వినియోగ వస్తువుల సమీకరణ, నిల్వకు ప్రభుత్వం సహకార స్టోర్స్ ఏర్పాటును ప్రోత్సహించాలి. చిన్న రిటైలర్ల మూలధన వ్యయ తగ్గింపునకు వేర్ హౌసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి.
- మార్కెట్ ధరలతో సంబంధం లేకుండా నశ్వర వస్తువులకు సంబంధించి రైతులకు గిట్టుబాటు ధర అందించడానికి అగ్రికల్చరల్ పెరిషబుల్ ప్రొడ్యూస్ కమిషన్‌ను ఏర్పాటు చేయాలి.

## అనుకూల వాదనలు

- భారత్‌లో సమష్టి డిమాండ్ పెరుగుదల రిటైల్ రంగ అభివృద్ధితోపాటు అనుబంధ సర్వీసుల అభివృద్ధికి కూడా తోడ్పడుతుంది.
- వ్యవసాయ రంగానికి అధికంగా లబ్ధి చేకూరుతుందని కొందరి అభిప్రాయం. రైతులు తమ ఉత్పత్తులను అధిక ధరలకు విక్రయించే అవకాశం ఏర్పడుతుంది.
- ఉపాధి రంగంలో వృద్ధి అధికమవుతుంది. ఈ చర్య వినియోగదారులకు కూడా లాభదాయకంగా ఉంటుంది.
- విక్రయదారుల్లో పోటీ పెరిగి వినియోగదారులకు నాణ్యమైన వస్తువులు చౌక ధరలకు లభ్యమవుతాయి.
- గతంతో పోల్చితే వినియోగదారులకు ఎక్కువ అవకాశాలు ఉంటాయి. తద్వారా ద్రవ్యోల్బణాన్ని అరికట్టొచ్చు.
- టెలి కమ్యూనికేషన్స్, బ్యాంకింగ్ రంగాల్లో ఎఫ్‌డీఐలను అనుమతించాక గత దశాబ్ద కాలంలో భారత ఆర్థిక వ్యవస్థలో చోటు చేసుకున్న వృద్ధిని గమనిస్తే, రిటైల్‌లో ఎఫ్‌డీఐల అనుమతిని శుభప

రిణామంగా పేర్కొనచ్చు.

- ఒక మిలియన్ జనాభా కంటే ఎక్కువగా ఉన్న 42 నగరాల్లోనే విదేశీ పెట్టుబడిదారులు తమ స్టోర్స్‌ను ప్రారంభించేలా ప్రభుత్వం నియంత్రణ విధించింది.
- ఎఫ్‌డీఐలు వృద్ధి రేటు పెరుగుదలకు తోడ్పడతాయని మద్దతుదారుల వాదన. ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో సంఘటితత్వాన్ని మెరుగుపర్చుకోవడం ద్వారా దీర్ఘకాలంలో ఈ చర్య అధిక సమర్థత, ప్రజల జీవన ప్రమాణాల పెరుగుదలకు దోహదపడుతుంది.
- విదేశీ పెట్టుబడిదారులు అవలంబించే నూతన సాంకేతిక పరిజ్ఞానం వల్ల అధిక ఉత్పత్తి, స్వదేశీ వినియోగం పెరుగుతుందని అభిప్రాయం.
- నేషనల్ శాంపుల్ సర్వే అభిప్రాయంలో దేశంలోని మొత్తం 459 మిలియన్ల శ్రామిక శక్తిలో 44 మిలియన్ల మందికి రిటైల్ రంగం ఉపాధి అందించగా, విదేశీ పెట్టుబడులను అనుమతిస్తే రిటైల్ కార్యకలాపాలు విస్తృతమై ఉపాధి అవకాశాలు అనుబంధ రంగాలన్నింటిలోను మెరుగవుతాయి.

## వ్యతిరేక వాదనలు

రిటైల్ రంగంలో ఎఫ్‌డీఐల అనుమతిని ప్రతిపక్ష పార్టీలతోపాటు యూపీఏ భాగస్వామ్య పక్షాలు కూడా వ్యతిరేకిస్తున్నాయి.

- జమ్ము కాశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి, పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ అధ్యక్షుడు ముఫ్తీ మహ్మద్ సయీద్ అభిప్రాయంలో 'యూరప్, అమెరికాల మాదిరి భారత్‌ను అభివృద్ధి చేసే క్రమంలో వాస్తవ పరిస్థితులను పరిశీలించాలి'.
- దినసరి వేతనాలతో ఈ రంగంపై ఆధారపడిన ప్రజలను దృష్టిలో ఉంచుకోవాలి. అన్ని కోణాల నుంచి లాభనష్టాలను బేరీజు వేసుకోవాలి.
- ఒకవైపు అభివృద్ధి చెందిన మెట్రోపాలిటన్ నగరాలు ఉన్న భారత్‌లోనే కనీస సౌకర్యాలు కూడా నోచుకోని వెనుకబడిన ప్రాంతాలు అధికంగా ఉన్నాయి. ఈ క్రమంలో ధనికులు, పేదల మధ్య ఆర్థిక వ్యత్యాసాలు ఈ చర్య ద్వారా ఇంకా పెరుగుతాయి.
- వ్యవసాయం తర్వాత అనేకమందికి ఉపాధి కల్పిస్తున్న ఈ రంగంలో భారీ పెట్టుబడిదారులకు అవకాశాలు కల్పించినందువల్ల వారి నుంచి ఏర్పడే పోటీని స్థానిక వర్తకులు తట్టుకోలేరు.
- విదేశీ పెట్టుబడిదారుల ప్రవేశం భారత ఆర్థిక వ్యవస్థ సమతుల్యంలో ఒడిదుడుకులకు కారణమవుతుంది.
- చిన్న, చిల్లర వర్తకుల వ్యాపారాలు దెబ్బతింటాయి. దీర్ఘకాలంలో వ్యవసాయదారులపై కూడా ప్రభావం చూపుతుంది.
- అనేక మిలియన్ల మంది ప్రజలు ఉపాధి కోల్పోవడం ద్వారా వారి సాంఘిక, ఆర్థిక స్థితిగతులు క్షీణి

స్థాయి.

- ప్రస్తుతం దేశంలో అవినీతి, నల్లధనం నియంత్రణలో ప్రభుత్వ వైఫల్యం ఎఫ్‌డీఐల అనుమతిలోనూ కనిపిస్తుంది.
- ఎఫ్‌డీఐల పట్ల చిన్న వర్తకుల వ్యతిరేకత ఈ రంగం అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతుంది.
- తయారీ రంగంలో అదనపు ఉపాధి కల్పనలో వైఫల్యం కారణంగా రిటైల్ రంగంలో నిరుద్యోగులకు తయారీ రంగంలో ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించే అవకాశాలు తక్కువ.

SAKSHI